క్లుప్తంగా

ఖాద్రీ ఆలయానికి భక్తుల తాకిడి



ఖాద్రీ ఆలయంలో భక్తుల రద్దీ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయంలో ప్రత్యేకంగా దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నివేదిత

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల, ఎన్ఎస్‌పీ కొట్టాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జేబీఏఆర్ కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత తనిఖీ చేశారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. 12 గ్రాముల హిమోగ్లోబిన్ శాతం ఉండాలని, అంతకు తక్కువగా ఉన్న వారికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది సూర్యనారాయణరెడ్డి, క్రిష్ణవేణి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు రంగమ్మ, రాధమ్మ, పద్మావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి విరాళం

తాడిమర్రి: 'స్పందించు సహాయం అందించు' కార్యక్రమానికి విరాళం అందించడం ప్రశంసనీయమని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల అభినందించారు. మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన పార్నపల్లి శ్రీనివాసులు కుమార్తె శిరీష, పార్నపల్లి కుమార్ కుమారుడు హరీష్ ఆర్డీటీ ద్వారా ఇంటర్, బీటెక్‌లు పూర్తి చేశారు. ప్రస్తుతం బ్యాంకుల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రామంలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శిరీష రూ.25 వేలు, హరీష్ రూ.10 వేలు, మాజీ సర్పంచ్ సంజీవులు రూ.5 వేలు ఆర్డీ ప్రమీలకు అందించారు. ఆర్డీటీ సహాయ సహకారాలతో ఉద్యోగాలు పొందామని, తమ వంతుగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మాంగద, సీఓ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు జొల్లిరెడ్డి రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజనాలు



వనభోజనాలకు తరలివెళ్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసినేపల్లిలో శనివారం ఊరంతా వనభోజనాలకు వెళ్లారు. ఉదయమే గ్రామస్తులందరూ ఇళ్లు ఖాళీ చేసి, వంటసామగ్రి గంపలకు ఎత్తుకొని చిన్నాపెద్దలు అంతా ఊరుబయట చెట్లకిందకు వెళ్లారు. పిండివంటలు అక్కడే చేసుకొని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఏటా శ్రీరామనవమి పండుగ అనంతరం గ్రామంలో వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు.

లక్ష్మీ చెన్నకేశవుడికి పూజలు

తాడిమర్రి: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మామిళ్లపల్లి సంతోష్‌శర్మ స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ పల్లకిలో హంస వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బాలం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఆర్బీకే ప్రారంభం

తలుపుల: మండలంలోని ఉడమలకుర్తి సచివాలయం వద్ద నూతనంగా నిర్మించిన రైతుభరోసా, హెల్త్ సెంటర్‌లను ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని నాయకులు ఐ.నారాయణరెడ్డి, వెంకటపతినాయుడు తెలిపారు.

డ్రిప్ పరికరాల దగ్ధం



కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గ్రామంలో శనివారం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో తిరుపాల్‌నాయక్, ఇందిరాబాయ్, నారాయణనాయక్ అనే రైతుల అరటితోట, మామిడితోట, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

టీడీపీది మోసం.. మాది సంక్షేమం

- సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవండి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఆకుతోటపల్లిలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీ చెరువు: టీడీపీ హయాంలో ప్రజలను మోసగిస్తే.. తాము అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో ఆదుకున్నామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శనివారం ఓడీ చెరువు గ్రామ సచివాలయం-1 పరిధిలోని వేమారెడ్డిపల్లి, ఆకుతోటపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటా ఎమ్మెల్యే పర్యటించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును వివరించారు. ఇచ్చిన హామీలను టీడీపీ అధినేత చంద్రబాబు అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేశాడో తెలియజేశారు. ముఖ్యమంత్రి పాలనపై రూపొందించిన ప్రశ్నావళికి మహిళల నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నట్లైతే 8296082960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరుకుంటున్నారా? లేదా ? అని వివరాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజల ఇంటి వద్ద వారి అనుమతితో స్టిక్కర్లు వేయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్లు పైబడి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని అందిస్తే ప్రతిపక్షాలు ప్రజలకు డబ్బు ఇవ్వడమే తప్పు అన్నట్టుగా చిత్రీకరిస్తున్నాయని విమర్శించారు. సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప,తహసీల్దార్ శ్రీధర్ ఎంపీపీ పర్వీన్‌బాను,జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి,కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, సర్పంచు గోవిందు, ఎంపీటీసీ రజిత, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి,అగ్రిఅడ్వైజరీబోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాష, నాయకులు నరసింహారెడ్డి, నారాయణ, ఎల్‌పీ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేష్, సూర్యనారాయణ, శ్రీరాములు, ఎల్ఐసీ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రంజక పాలన

తాడిమర్రి: పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా రంజక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటా తిరుగుతూ 'నవరత్నాల'ను వివరించారు.కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటవరద, మాజీ సర్పంచ్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు అశ్వర్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కొత్తచెరువు: 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా శనివారం తలమర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ రత్నమ్మ, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, కమ్మన్న, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- కొత్తచెరువులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నాయకులు విస్తృతంగా నిర్వహించారు. ప్రభుత్వ పనితీరు, పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, నాగరాజు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ భాస్కర్, సచివాలయ కన్వీనర్ షాన్ షేట్, గిరి, శివ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'మా నమ్మకం నువ్వే జగన్'

ఎన్‌పీకుంట: మండల వ్యాప్తంగా శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ముమ్మరంగా నిర్వహించారు. పి కొత్తపల్లి, ఎగువతూపల్లి, మేకలచెరువు, వెలిచలమల, పడమరనడిమిపల్లి, టీఎన్ పల్లి, మండెంవారిపల్లి గ్రామాలలో గృహసారథులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ ప్రజల మద్దతు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచులు బండ్రేవుసరిత, జమున, వెంకటేష్, ఉపసర్పంచులు సామిరెడ్డి, నాయకులు గోవిందునాయక్, ఈశ్వర్‌నాయక్, అంజి, వెంకటరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, అశోక్, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, తదితరులున్నారు.

ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

అమడగూరు: సంక్షేమ పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వానికి అండగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. అమడగూరు, చినగానిపల్లి, చీకిరేవులపల్లి, కసముద్రం, గుండువారిపల్లి, పూలకుంటపల్లి, తుమ్మల, కొట్టువారిపల్లి, జేకేపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ గృహసారథులు

గాండ్లపెంట: మండల పరిధిలోని 7 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖర రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సోమశేఖరరెడ్డి, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో బుక్‌లెట్లు అందిస్తున్న నాయకులు



ముదిగుబ్బలో..

ఉత్సాహంగా..

తలుపుల: 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా చేపట్టారు. ఎంపీపీ రఫినాయక్, జేసీఎస్ కన్వీనర్ టోపీరమణ, సేవాదల్ జోనల్ ఇన్‌చార్జ్ క్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్లు తదితరులు నిర్వహించారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని 3,4 వార్డులలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, చంద్రాయుడు, భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు మండలంలో..

నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి, పంతులచెరువు, తవళంమర్రి, నల్లచెరువు, పత్రవాండ్లపల్లి గ్రామాలలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మాజీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, సర్పంచులు పంచరత్నమ్మ, స్వర్ణలత, ఎంపీటీసీ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెంపుల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగభూషణ, నజీర్, రామాంజనేయులు, హనుమంతురెడ్డి, సూర్య నారాయణరెడ్డి తదితరులున్నారు.

రేపు 'ఆసరా' చెక్కుల పంపిణీ

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సోమవారం 3వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ రమనప్ప తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో సీసీలు, యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, ఏపీఎం హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న కేతిరెడ్డి సుప్రియ

తాడిమర్రి: మండల కేంద్రంలోని రేణుక యల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.50 వేలు విరాళం అందించారు. ధర్మవరంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆమె నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయానికి..

ధర్మవరం: పట్టణంలోని ఇందిరానగర్‌లో నూతనంగా నిర్మించబోయే పెద్దమ్మ దేవాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.50 వేలు విరాళం అందించారు.

శిల్పారామంలో నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో ఆదివారం సాయంత్రం అంధుల నిరీక్షణ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గంగన్న తెలిపారు. శనివారం సాయంత్రం శిల్పారామంలో కరపత్రాలు విడుదల చేశారు. సంఘం స్థాపన దినోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటల వరకూ సాంస్కృతిక నాట్య కళా ప్రదర్శన, సంగీత విభావరి ఉంటుందన్నారు. గాజువాక ఝాన్సీ, రమేష్ మాస్టర్ పాల్గొంటారన్నారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత



చెక్కులను అందిస్తున్న ఆర్డీ శాంతమ్మ

గాండ్లపెంట: గాండ్లపెంట, ఎన్‌పీకుంట మండలాల్లో ఉన్నత విద్య, సాంకేతిక విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థుల చదువుకు ఆర్డీటీ చేయూతనిచ్చింది. శనివారం స్థానిక ఏరియా కార్యాలయంలో రెండు మండలాలకు చెందిన 150 మంది విద్యార్థులకు రూ.6 లక్షల చెక్కులను అందించారు. ఏటీఎల్ క్రిష్టా ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ చేతుల మీదుగా చెక్కులను అందించారు. ఆర్డీ మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి ఉన్నత ఉద్యోగాలు పొంది తల్లిదండ్రులను, సహాయం చేసిన సంస్థను మరవకూడదన్నారు. మంచి చదువులు చదివి జీవితంలో స్థిరపడి గ్రామానికి, సంస్థకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఓలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. గార్లదిన్నె రామాంజనేయులు వృషభాలు ప్రథమ, గంగవరానికి చెందిన గురుయాదవ్ వృషభాలు ద్వితీయ, తోపుదుర్తి చెన్నప్ప వృషభాలు తృతీయ, శీర్పి గ్రామానికి చెందిన గోపాల్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. రాప్తాడు సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి చేతులు మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామచంద్రారెడ్డి, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, గాలి తాతిరెడ్డి, హనుమంత రెడ్డి, లక్ష్మిరెడ్డి, వీఆర్‌ఓ మహేష్‌రెడ్డి, ఎంపీటీసీ పవన్ కుమార్‌రెడ్డి, పాళ్యం నారాయణ రెడ్డి, శివ, మంజు, కురుబ నారాయణ, సుదర్శన్, ఉప సర్పంచు రాజారెడ్డి, బుక్కారెడ్డి, టి.శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బంగారు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న ఆత్మారామిరెడ్డి

ఘనంగా సూర్యప్రభ ఉత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

అమడగూరు: మండలంలో నిర్వహిస్తున్న చౌడేశ్వరీదేవి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు శనివారం సూర్యప్రభ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎప్పటి లాగానే సూర్యప్రభ ఉత్సవాన్ని చీకిరేవులపల్లి, నల్లగుట్లపల్లి గ్రామస్తులైన కేతిరెడ్డి, రాజు కుటుంబీకులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రభ ఉత్సవంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తాదులు అమ్మవారి దర్శనం చేసుకొని పరవశించిపోయారు. విద్యుత్ దీప కాంతుల నడుమ అలరించిన చౌడేశ్వరీ అమ్మవారిని గ్రామస్తులంతా ఆలయం నుంచీ గ్రామ నడిబొడ్డులో ఉన్న ఉట్టి వరకూ తీసుకెళ్లి భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. అక్కడ భక్తాదులంతా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కొబ్బరి కాయలను సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. నేడు చంద్రప్రభ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త పురుషోత్తమరెడ్డి, నిర్వాహకులు సర్పంచ్ రాజు సురేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో గడప గడపకూ..

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలోని 3, 6 సచివాలయాల పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారని, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'పుట్టపర్తిని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలి'

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తిని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని సాయి యూత్ భక్తులు డిమాండ్ చేశారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ సత్యమ్మ దేవాలయం నుంచి గోకులం ఆర్చ్ వరకూ టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని, లేకుంటే నిరాహార దీక్ష చేపట్టడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయిగీత, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, కత్తి రాజారెడ్డి, నరేంద్రరెడ్డి, దాసరి శంకర, పీసీ గంగన్న, ఆదినారాయణ, పుట్లగంగాద్రి, బెస్త సూరి తదితరులున్నారు.

దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాషా



బాషాకు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం: నూర్‌భాష దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధర్మవరం 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సరితాలబాషా ఎంపికయ్యారు. శనివారం పులివెందులలో దూదేకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిక జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్‌సాహెబ్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి
- మృతుల కుటుంబాలకు రూ. 50 వేల అందజేత



శ్రీనివాసులరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: నల్లచెరువు మండలం ఎర్రగుంటపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కనసానివారిపల్లిలో శనివారం నిర్వహించిన అంత్యక్రియలలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పాల్గొన్నారు. మృతదేహాల వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్సార్ సీపీలో చురుకైన కార్యకర్తలుగా ఉండేవారన్నారు. వారి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మృతి చెందిన శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున రూ. 50 వేలను అందజేశారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటానన్నారు. శ్రీనివాసులరెడ్డి కుమా రులు హరీష్‌కుమార్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డిని చదివించే బాధ్యతను తీసుకుంటానని చెప్పారు. నాయకులు శ్రీనివాసులనాయుడు, చిదానందరెడ్డి, వినోద్‌కుమార్, హేమశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, పూల శీనా, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం ఏపీ జేఏసీ పిలుపు మేరకు కదిరి ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లకండువాలు ధరించి నిరసన తెలిపారు. డిమాండ్లకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నిరసన కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవైపీ రాష్, నాయకులు సుధాకర్‌రెడ్డి,దివాకర్, శంకరప్ప,బాషా,గంగాధర్, సుదీర్, అనిల్‌బాషా,బిఎస్ రెడ్డి, కుళ్లాయప్ప ఉన్నారు.

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏపీ జేఏసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. రామగిరి తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ ఉద్యోగులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అమలు జరపాలని, పెండింగ్‌లో ఉన్న మూడు కొత్త డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల అరియర్స్ చెల్లించాలని, 12వ పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించాలని, కొత్త జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలిపారు. వీఆర్వో రాఘవరెడ్డి, మురళి, ఆర్టీసీ డిపో నాయకులు శ్రీరాములు, తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

'పది' పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

కనగానపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, మోడల్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 376 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసి, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి అర్బన్: ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పుట్టపర్తి మండలం జగరాజుపల్లి బస్టాండు వద్ద శనివారం చోటు చేసుకుంది. పుట్టపర్తి రూరల్ ఎస్సై దాదాపీర్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం గంటల మారెమ్మ కనువ వద్ద నుంచి పునాది రాళ్ల ట్రాక్టర్ కొత్తచెరువు వైపు వెళ్తోంది. జగరాజుపల్లికి చెందిన తిప్పారెడ్డి బస్టాండులో బస్సు కోసం వేచి ఉన్నాడు. ట్రాక్టర్‌ను డ్రైవర్ విక్రం అదుపు చేయలేకపోవడంతో బస్టాండులోకి రాగానే బోల్తాపడింది. అక్కడే ఉన్న తిప్పారెడ్డిపై రాళ్లు పడడంతో కాళ్లు తీవ్రంగా దెబ్బ తినగా, తలకు బలమైన గాయాలయ్యాయి. అయన్ను వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా రెండు కాళ్లకు చికిత్స చేసి, తలకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కియా బస్సును ఢీకొన్న బొలెరో

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గిర్రాజుకాలనీ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద శనివారం ఆగి ఉన్న కియా బస్సును వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి బెల్లం వేసుకుని బొలెరో వాహనంలో వస్తున్న నవీన్, గిరీష్‌లు గిర్రాజుకాలనీ సమీపంలో ఆగి వున్న కియా బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నవీన్, గిరీష్‌లకు స్వల్పగాయాలయ్యాయి.

రంజాన్ తోఫా పంపిణీ

చెన్నేకొత్తపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ముస్లింలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అందించిన రంజాన్ తోఫాను వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలు రామ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి తదితరులున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

కనగానపల్లి: వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను ఆదివారం రామగిరి మండలం పేరూరులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో పాటు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరవుతారన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

పుట్టపర్తి అర్బన్: పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి-1 (ఎస్టీ), పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి-1(బీసీ సి), పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి (బీసీ బీ) అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమందేపల్లి మండలం పెద్ద బాబయ్యపల్లి (బీసీఈ) మినీ అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. పెనుకొండ మండలం కొత్తపేట (ఎస్సీ), శ్రీరాములయ్య కాలనీ (ఓసీ), బి.టి.ఆర్ కాలనీ-2 (బీసీ బీ), దుద్దేబండ (బీసీ డీ), ఎర్రమంచి-1 (ఎస్సీ), వజ్రాలపేట (ఓసీ), రొద్దం మండలం రొద్దం-2 (బీసీ డీ), తురకలాపట్నం-2(బీసీ బీ), శేషాపురం-2 (ఓసీ), పుట్టపర్తి పట్టణంలోని జానకీరామయ్య కాలనీ(ఓసీ) సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వివరాల కోసం పెనుకొండ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.